కథానిక

# ఫలించని పంచాయతీ

"అమరశ్రీ"

తనకొడుకు బారసాలకి అందరూ పెద్దమనుషులే ఎందుకు వచ్చారో మధ్యాహ్నం పన్నెండింటి వరకూ శేషగిరిరావుకు అర్థంకానిమాట నిజం. తన తండ్రి అందరూ పెద్దమనుషులు మాత్రమే వచ్చేలా ఎలా ఏర్పాటు చేశాడో బుర్ర బద్దలుకొట్టుకున్నా తెలియలేదు. తన తండ్రి చాకచక్యానికి నవ్వాలో ఏడవాలో తోచిందికాదు శేషగిరిరావుకి.

అన్నిటికంటె విచిత్రమేమిటంటే తన మామగారు ఆ పెద్దమనుషులలో ఒకడు. ఆయనకి ఆ పదవి ఎలా లభించిందో ఊహించుకోలేకపోయూడతను. కట్నండబ్బుసంగతి ఎత్తని మనిషి, కెమెరా ఇస్తానని మళ్ళా దానిసంగతి ఎన్నడూ ప్రస్తావించని తన మామ, ఎప్పుడూ ప్రతిదానికీ ఇదుగో, అదుగో అంటుండే మామ ఏవిధంగా ప్రాతినిధ్యం వహించబోతున్నాడాఅన్న సందేహం వెంటనే కలిగింది.

తన మేనమామ విషయం అసలు ఆలోచించవలసిన పనిలేదనుకున్నాడు శేషగిరిరావు. మేనల్లుడి బాధ్యతంతా మేనమామ భుజస్కంధాలమీద ఉన్నదనుకునే తన మేనమామ ఆ పెద్దమనుషులలో కలవకపోతే అతను ఆశ్చర్యపడి ఉండేవాడు. తనకు చదువు చెప్పిస్తే పచ్చిరౌడీగా తయారవుతాడని, తన తండ్రికి ఆరేళ్ళక్రితం చెప్పాడు ఆ మహాత్ముడు. తన జ్యోతిషం జరిగిందన్నట్లు సగర్వంగా నడుస్తాడు ఆయన శేషగిరి ఇంటికి చూడటానికి వచ్చిన ప్రతిసారీ. ఆరుసంవత్సరాల క్రితమే తన కొడుకు ఏంకాబోతున్నాడో చెప్పగలిగిన పెద్దమనిషిని శేషగిరిరావు తండ్రి ఆ సందర్భంలో ఆహ్వానించకుండా ఉండలేకపోయాడు.

కొడుకు బారసాలని సంతోషపడాలో తన వ్యవహారపు పంచాయతీరోజని విచారించాలో శేషగిరిరావుకి తెలియలేదు. మనమడి బారసాలను అంత తెలివిగా ఏర్పాటుచేసిన తన తండ్రిమీద శేషగిరిరావుకి కోపంరాలేదు. తండ్రీకొడుకులమధ్య తగాదాలపరిష్కారం, ఊళ్ళో పెద్దమనుషులు చేయగలరనే నమ్మకం లేదు తనకి. చిన్నప్పటినుంచీ పెంచి అన్నీనేర్పిన తండ్రికొడుకును అర్థంచేసుకోలేకపోతే, అదేపని బయటవాళ్ళకి సాధ్యమవుతుందని అతను ఎన్నడూ నమ్మలేదు. తనకీ తన తండ్రికీ మధ్య ఉన్న మంచిచెడ్డలు ఇతరులకి ఎంతవరకూ గ్రాహ్యమవుతాయన్న విషయం ఆ పెద్దమనుషులలో ఒక్కరికీ తెలియదని తను అతి సులభంగా గ్రహించగలిగాడు.

బారసాల కార్యక్రమం జరుగుతున్నంతసేపు సాగిన గుసగుసలు అతనికయితే వినిపించలేదుకాని చూడగలిగాడు. వాళ్లు తనవైపు విసిరే చూపుల నిండా అనుమానం పసికట్టినమాదటగాని అసలు విషయం ఫలానా అని తేల్చుకోలేకపోయాడతను. అన్నివిషయాలు అప్పుడు తెలిసికొన్నా ఏమీ చేయలేననుకొని సమాధాన పరచుకొన్నాడు.

తనమీద తండ్రికి అంత కోపమూ, కక్షా ఎందుకో ఎన్నాళ్ళనుండీ ఆలోచించినా బోధపడలేదు శేషగిరిరావుకి. ఇంటర్మీడియెటు చదువుతుండగా పారిపోయి శాంతికేతన్‌లో బొమ్మలు గీయటం ప్రారంభించిన నాటినుండి అది ప్రారంభమయిందని మాత్రం చెప్పగలడు. తను శ్రద్ధతో చేస్తున్న పనిని అప్పుడే ఆపితే బాగుండేది. పరిస్థితులు ఇంతవరకూ వచ్చేవి కావు. ఇప్పుడుకూడా తండ్రిని ఎదిరించి తనుచేస్తున్న చెడ్డపని ఏదీలేదు.

బొమ్మలు గీసుకుంటాను, తినటానికి ప్రతినెలా డబ్బివ్వమంటే తనను పచ్చిదుర్మార్గుడనీ, సోమరిపోతనీ, ఏమీ చేతకానివాడనీ అనుకుంటారని ఫొటోస్టూడియో పెడతానన్నాడు తను. అందుకు కావలసిన పెట్టుబడి పెట్టమన్నాడు. సరేనని మెత్తబడి అంగీకరించి, ఒక్క షరతు మాత్రం పెట్టాడు తనతండ్రి. పెళ్ళిచేసుకుంటే ఆ సదుపాయాలన్నీ అవలీలగా కళ్ళుమూసుకొని చేసేస్తానన్నాడు.

తన ఉద్దేశం కుంటిదికాదు. కాబట్టి, ఇతరుల ఉద్దేశాలు కూడా కుంటివికాదని శేషగిరిరావు అనుకున్నమాట నిజం. పెళ్ళి ముగించుకొన్న మరుక్షణం తేలిపోయింది, ఏవి నీళ్ళో ఏవి పాలో. పెళ్ళిచేసి తనను కట్టివేయాలనుకున్నాడని గ్రహించటానికి ఎక్కువకాలం పట్టలేదు.

స్టూడియో విషయం ప్రస్తావించిన ప్రతిసారీ, కొలమూ, మామిడితోటలూ, విత్తనాలూ, నాగళ్లూ తీసుకొచ్చేవాడు, సంభాషణలోకి తన తండ్రి. క్రమేణా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. అదే తన తండ్రి మనస్సులో ఉన్న విషయమని ముందే కనిపెట్టగలిగిఉంటే తనసలు పెళ్లే చేసుకొనేవాడు కాదు.

ఇదికూడా ఒకందుకు మంచికేనేమో ననుకొని మామగారిని ఆశ్రయిద్దామనుకున్నాడు. నేరక సిగ్గువిడిచి అడిగాడు తను, పెట్టుబడి పెట్టమనీ, రెండుమూడుసంవత్సరాలలో అప్పు పూర్తిగా తీరుస్తాననీ. అరటిపండు అమాంతం ఒలిచి చేతిలో పెట్టేశాడాయన. తను 'ఫారిన్'నుండి తెచ్చిన కెమెరా తీసుకుపొమ్మన్నాడు.

తన బావమరిది కెమెరా తగిలించుకొని తిరగటం మొదలుపెట్టగానే, అనుమానించాడు శేషగిరిరావు. మామ తనచేతిలో పెట్టిన అరటిపండు తినేదికాదనీ, ఆడుకోవటానికి పనికొచ్చే బొమ్మనీ నిజం నిలకడమీద తేలింది: ఆయన తరువాత కెమెరా విషయం పూర్తిగా మర్చిపోయినట్లే కనుపించేవాడు. అటువంటి మనిషిని పెట్టుబడికని డబ్బు అడిగి ప్రయోజనం లేదనుకొని నోరుమూసుకొని ఇంటికి వచ్చేశాడు శేషగిరిరావు.

ఎవరన్నా డబ్బిస్తే తను సిద్ధమేనని చాలా మందికి చెప్పాడు ఎన్నోసార్లు...డబ్బివ్వటానికి సిద్ధమేనని మాత్రం ఎవ్వరూ ఎన్నడూ అనలేదు. తినటానికి ఇంత ఉన్నదిగాబట్టి ఇంటిపట్టునే అంటిపెట్టుకోవటం అప్పటికి మంచిదనుకొని ఎక్కడకీ కదలలేదు శేషగిరిరావు.

తను డబ్బు సంపాదించకపోగా కనీసం అదన్నా చేయలేకపోయానని ఎన్నడూ అతడు బాధపడలేదు. కిందామీదాపెట్టి, అగడ్డీకగడ్డీ కఅచి, చేతనయినంత వరకూ కనుపించిన ప్రతివాడినీ మోసంచేసి డబ్బుగడించి అందరినీ తృప్తిపరచాలని ఎన్నడూ అనుకోలేదు శేషగిరి రావు. కాని డబ్బు ఏవిధంగానైనా సరే, దొంగతనంచేసైనా సరే సంపాదించగలిగితే తన పరిస్థితి ఆవిధంగాఉండదని శేషగిరిరావుకి తెలియకపోలేదు.

తనకళ్ళ ముందున్న ఆ పెద్దమనుషులకోసం, వాళ్ళ గౌరవార్థం తను అటువంటి సత్కార్యాలకు పూనుకోదలచలేదు. చాలాసేపు తర్కించుకున్న మీదటగాని, గ్రహించుకోలేక పోయాడు వాళ్ళందరూ ఆరోజు ఎందుకువచ్చారో, భోజనాలుచేసి ఒక్కొక్క చెట్టుక్రింద ఇద్దరూ, ముగ్గురూ కూర్చోని తలకాయలు చేర్చటం చూసినవెంటనే నిర్ధారణ చేసుకొన్నాడు శేషగిరిరావు, కొద్దిక్షణాలలో పంచాయతీ ప్రారంభం కావచ్చునని.

అనుకున్న ప్రకారం తు,చ తప్పకుండా సభ ప్రారంభమయింది సాయంకాలం. కాఫీవేళకి చెట్ల క్రింద తలకాయలన్నీ వరండాలోకి జేరినయ్. శేషగిరిరావు చేతనయినంత విధేయత చూపించటానికి ప్రయత్నించాడు మాటలలోనూ చేతలలోనూ.

అందరూ లోకాభిరామాయణంలోకి దిగారు. కదలిక ప్రారంభమయిందని తన జాగ్రత్తలో తను ఉండిపోయాడు శేషగిరిరావు. మాట్లాడుతూనే సంపాదన, డబ్బూ, వృత్తి, ఉద్యోగాల విషయం ఎడతెరిపిలేకుండా మాట్లాడుతుండగా అనుకున్నాడు శేషగిరి అది చివరిమెట్టని.

"సరేగాని, అసలు మనవాడు ప్రస్తుతం ఏం చేస్తున్నట్లు?" అన్నాడు తలపంకించి వెంకట్రామయ్య — ఒకటోరకం కల్తీలేని పెద్దమనిషి. ఆ మాటలంటూనే ఆయన శేషగిరిరావు ముఖంలోకి చూడటం, శేషగిరిరావు కూడా ఆయన ముఖంలోకి చూడటం జరిగినయ్.

"వాడినే అడగండి. ఇక్కడే ఉన్నాడుగా. ఏరా శేషగిరీ!" అన్నాడు శేషగిరి మేనమామ.

శేషగిరి ఒక చిన్ననవ్వు నవ్వి, అధ్యక్షపీఠాన్నలంకరించి చుట్ట నిషాలో మునిగిపోయిన తండ్రి వైపు చూసి ఊరుకున్నాడు. ఒక్క క్షణకాలం అంతా నిశ్శబ్దంగా ఉండిపోయారు.

"చూస్తావేరా! పెద్దమని అడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పకుండా" అన్నాడు మళ్ళా తన మేనమామ.

"మీకు తెలియకపోతేగా నేను చెప్పటానికి!"

"తెలియకనేగద బాబూ అడగటం" అన్నాడా ఒకటవనంబరు పెద్దమనిషి.

"ఏమీ చేయటం లేదండి, నిజం చెప్పాలంటే."

"నిజమేకదా చెప్పమన్నది" అందుకొన్నాడు మరో పెద్దమనిషి.

"అందుకనే కదండి నిజంచెప్పాను" అన్నాడు శేషగిరిరావు.

"కోప్పడకు నాయనా" అన్నాడొక ముసలి పెద్దమనిషి, ఇటువంటి పంచాయతీలు ఎన్నో చూశానన్న అనుభవదృష్టితో.

"వాడికి వాళ్ళ నాన్నంటేనే కోపం. పరాయి వాళ్ళ వరకూ ఎందుకు"అన్నాడు తన మేనమామ.

"తండ్రిని లోకువగా చూడటం తప్పని మనం చెప్పాలేమిటి" అన్నాడు అవకాశం దొరికిందను కుంటూ అంతవరకూ ఊరుకున్న మరో పెద్ద.

"నే నెన్నడూ చూడలేదే!" అన్నాడు.

"ఈమధ్య మాట్లాడటం మానేశావటగా?" అన్నాడులాపాయింట్లనీ తెలుసుకున్న మేనమామ.

"మాట్లాడక పోవటం ఎన్నడూలేదు." అని శేషగిరి "పోనీ మా నాన్ననే అడగండి." అన్న వాక్యం కలిపాడు.

"నాన్నకీ నీకూ మధ్య అభిప్రాయ భేదం లేదన్న మాట." అన్నాడు కెమారామామ.

"లేదన్న మాటకాదు. లేదు"అన్నాడతను.

"ఫోటో స్టూడియో విషయం సంగతేమిటి మరి?" అన్నాడు కెమారామామ, తన కెమరా సంగతి జ్ఞాపకం వచ్చినా మర్చిపోయి.

"ఏముంది? నేను పెడతానన్నాను. డబ్బులేద న్నారు. అంతటితో అది ఆఖరు." అన్నాడు తను.

"అందుకని నువ్వు పనీపాటా లేకుండా తిరుగు తున్నావనమాట" అన్నాడు మేనమామ, పబ్లిక్ ప్రాసిక్యూటరు హోదాలో.

"చూపించమనండి చేస్తాను."అన్నాడు.

"చెప్పాడుగా ఆయన, పొలం విషయం చూసుకుంటూ ఇంటిపట్టున ఉండమని."

"ఉంటున్నాగదా? కొద్దిరోజులలో పొలం పనులు చూడటంగా చేస్తాను కూడా." అన్నాడు శేషగిరిరావు.

"ఎక్కడ? కమ్యూనిస్టుపార్టీ ఆఫీసులోనా?" అన్నాడు ధైర్యంగా కెమరామామ.

శేషగిరిరావు ఆయన వైపుచూసి చిన్నగా నవ్వాడు. 'పబ్లిక్ ప్రాసిక్యూటరు' అందుకున్నాడు.

"నీకా పార్టీతో ఏంపనిరా?"

"పనిలేకనే అక్కడికి పోవటం, చదరంగం ఆడుకోటానికి" అన్నాడు శేషగిరిరావు.

"చదరంగానికి మరో చోటు లేకనా?"

"చోటులేక గాదు, మనుషులు లేక."

"కుంటి సమాధానాలెందుకు పైగా"అన్నాడు మేనమామ.

"కావాలంటే వాళ్ళనే అడగండి."

"ఇదొకటా? ఎలుకకి పిల్లి సాక్ష్యం."

"వెళ్ళవద్దంటే మానుకుంటాను"అన్నాడు శేష గిరిరావు ఆలస్యం చేయకుండా.

"అనేగా చెప్పటం"అని నొక్కాడు, పబ్లిక్ ప్రాసిక్యూటరుమామ.

"సరే"అన్న శేషగిరిరావు మాట పంచాయ తీలో చివరిమాటగా ఉండిపోయింది.

శేషగిరిరావు అంత మనిషని తెలిసి ఉంటే, తాము పంచాయతీకి రాకనే ఉందుమనుకొన్నారు, ఆ పెద్దమనుషులందరూ ఎవరిలోవారు. అందరిలోకి కెమెరా మామ ఎక్కువగా మథనపడటం సంభవిం చింది, అనవసరమైనవిషయాలలో ఎందుకు జోక్యం కలుగజేసుకున్నానా అని.

ఆ రాత్రి చెట్లకింద దీపాల అవసరం లేక పోయింది. మరునాడు ఉదయం, రెండుమూడు రోజులు ఉందామనుకొని వచ్చిన పంచాయతీ దార్లకు వీడ్కోలు స్వయంగా ఇచ్చాడు, రైల్వే స్టేషనులో శేషగిరిరావు.

ఇంటికిరాగానే భోజనంచేసి మామూలుగానే చదరంగం ఆడుకోవటానికి పార్టీ ఆఫీసుకు పోయాడు. ఇష్టంలేకనే, ఆ విషయం ప్రస్తావించ లేదు శేషగిరిరావు తండ్రి. తనతో పలకటంలేదన్న విషయం పంచాయతీ చేయించిన తండ్రి, శేషగిరి రావుని పని ఉన్నప్పుడూ పలకరించటం మాను కున్నాడు. శేషగిరిరావు దినచర్యలో మార్పు ఆవ గింజంతకూడా లేకపోవటం అతని తండ్రికి ఆశ్చ ర్యాన్ని కలిగించలేదు. కాని తన తండ్రికి పంచా యతీలంటే నమ్మకం తగ్గిపోయిందన్న విషయం గ్రహించటానికి ఎక్కువకాలం పట్టలేదు, శేషగిరికి.